7

సాక్షి
శ్రీకాకుళం

ఆదివారం । 14 । జూలై । 2024

న్యూస్‌రీల్

కృష్ణావతారంలో..



కృష్ణావతారంలో జగన్నాథస్వామి

నరసన్నపేట: స్థానిక వెంకటేశ్వరాలయంలో జగన్నాథస్వామి శనివారం కృష్ణావతారంలో దర్శనమిచ్చారు. రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా స్వామిని రోజుకో అవతారంలో అలంకరిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

లేట్రల్ స్పాట్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం




ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ రెండో ఏడాదిలో ప్రవేశాలకు సంబంధించి లేట్రల్ స్పాట్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా ప్రవేశాల కన్వీనర్ జి.దామోదర్‌రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒకేషనల్ ఇంటర్మీడియెట్, ఐటీఐ ఇతర కోర్సులు చదివి ఎస్‌బీటెట్ పరీక్ష అర్హత సాధించి, బ్రిడ్జి కోర్సు పూర్తిచేసిన వారికి ఈ అవకాశం లభిస్తుందని అన్నారు. జిల్లాలో 10 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలు ఉండగా, సీటు కావాలనుకు నే కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని, కౌన్సెలింగ్ మాత్రం శ్రీకాకుళం ప్రభుత్వ కళాశాలలో మాత్రమే ఉంటుందని చెప్పారు. 16వ తేదీ సాయంత్రంలోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. 18వ తేదీన స్పాట్ ప్రవేశాలు అలాట్‌మెంట్‌ల కౌన్సెలింగ్ శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉంటుందని వివరించారు. 22వ తేదీన నోడల్ ప్రిన్సిపాల్ మంగళగిరి స్టేట్ బోర్డాఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌కు వివరాలు అందజేయనున్నట్లు వివరించారు. అర్హత ఉన్న విద్యార్థులు కౌన్సెలింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తి


ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ పాలీసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా రెండో విడత కౌన్సెలింగ్‌కు సంబంధించి ధ్రువీకరణ పత్రాల పరిశీలన శనివారం ముగిసింది. చివరి రోజు 25 మంది హాజరు కాగా, మొత్తం మూడు రోజుల్లో 95 మంది హాజరయ్యారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సహాయ కేంద్రంలో ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. విద్యార్థుల ఆప్షన్ల నమోదు సైతం ఆదివారంతో ముగియనుంది. కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో కళాశాలలు, బ్రాంచ్‌ల ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. గతంలో సీట్లు లభించిన విద్యార్థులుసైతం కళాశాలలు మార్చుకోవచ్చు. జిల్లాలో 10 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీల్లో 2674 సీట్లు ఉండగా, 1427 ప్రవేశాలు జరిగాయి. 1247 సీట్లు ఖాళీగా ఉన్నాయి. కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రిన్సిపాల్ జి.దామోదర్‌రావు, అధ్యాపకులు మురళీకృష్ణ పర్యవేక్షించారు.

ముగిసిన ఏపీఈఏపీ సెట్ ఎంపీసీ స్ట్రీమ్ కౌన్సెలింగ్



ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజినీరింగ్ ప్రవేశాలకు సంబంధించి ఎంపీసీ స్ట్రీమ్ ఏపీ ఈఏపీసెట్ – 2024 ఆన్‌లైన్ కౌన్సెలింగ్ శనివారంతో ముగిసింది. ఈ నెల 1వ తేదీన ప్రారంభమైన కౌన్సెలింగ్, శనివారం ఆప్షన్ల మార్పు అవకాశంతో ముగిసింది. 16వ తేదీన సీట్లు అలాట్ చేస్తారు. 17 నుంచి 22వ తేదీ మధ్య విద్యార్థులు కళాశాలలకు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. 19వ తేదీ నుంచి క్లాస్‌వర్క్ ప్రారంభించనున్నారు. జిల్లాలో నాలుగు ఇంజినీరింగ్ కాలేజీల్లో 3360 సీట్లు ఉండగా, ప్రైవేట్ కళాశాలల్లో 70 శాతం కన్వీనర్, 30 శాతం మేనేజ్‌మెంట్ కోటా విధానంలో ప్రవేశాలు నిర్వహిస్తారు. జిల్లా విద్యార్థులు రాష్ట్రం యూనిట్‌గా ర్యాంకు బట్టి పట్టణ ప్రాంత కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు సైతం ఆప్షన్లలో ప్రాధాన్యత ఇచ్చారు. మొదటి కౌన్సెలింగ్ ప్రవేశాలు పూర్తయ్యాక, ఉన్నత విద్యా మండలి రెండో విడత కౌన్సెలింగ్‌కు ప్రకటన ఇవ్వనుంది.

రికవరీ



- మహిళా సంఘాల నెత్తిన ఆటో డెబిట్ భారం
- స్త్రీనిధి రుణాలకు తప్పనిసరిగా ఆటో డెబిట్ విధానం
- స్త్రీనిధికి తగ్గనున్న రుణాల శాతం
- సంఘ సభ్యుల మధ్య వివాదాలకు ఆస్కారం

శ్రీకాకుళం పాతబస్టాండ్:

మహిళా సంఘాల నెత్తిన కొత్త ప్రభుత్వం కొండంత భారం మోపింది. స్త్రీనిధి రుణాల చెల్లింపుల్లో ఆటో డెబిట్ విధానాన్ని ప్రవేశపెడుతూ వారి పొదుపు డబ్బుతో రుణాలు రికవరీ చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసింది. మహిళా స్వయం శక్తి సంఘాలకు బ్యాంకు లింకేజీలతో పాటుగా స్త్రీనిధి సంస్థ ద్వారా రుణాలు ఇస్తున్నారు. రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో ఈ రుణ పంపిణీ జరుగుతుంది. జిల్లా స్థాయిలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఈ ప్రక్రియ నిర్వహిస్తుంది. స్త్రీనిధి బ్యాంకు ద్వారా జిల్లాలో మహిళా స్వయం శక్తి సంఘాల సభ్యులకు రుణాలు ఇస్తారు. ఈ రుణం తీసుకున్న వారు వాయిదాల విధానంలో ప్రతి నెల అసలు వడ్డీ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పుడు ఆటో డెబిట్ ద్వారా పొదుపు సొమ్ముతో వాయిదాలను కట్ చేసుకుంటారు.

రుణం ఇలా..

సంఘంలో సభ్యులు అందరూ లేదా, అందులో కనీసం మూడు కంటే ఎక్కువ మంది స్త్రీనిధి ద్వారా రుణం తీసుకుంటారు. సంఘానికి రూ.5లక్షల వరకు రుణం ఇస్తారు. సాధారణంగా సంఘంలో సభ్యులంతా రుణాన్ని తీసుకుంటారు. లేదంటే అవసరాన్ని బట్టి కొందరే వాడుకుంటూ ఉండడం గ్రూపుల్లో కనిపిస్తూ ఉంటుంది.

చెల్లింపులు ఇలా..

ఒక సంఘంలో ఉన్న సభ్యులు ముగ్గురు లేదా నలుగురు రుణం తీసుకుంటే వారు ప్రతి నెల వాయిదా స్త్రీనిధికి నేరుగా, లేదా ఆ గ్రామ అకౌంటెంట్ (సీఏఫ్) ద్వారా చెల్లించేవారు. నగదు చెల్లించిన వెంటనే రశీదు పొందేవారు. రుణం తీసుకున్న వారిలో ఒక నెల, అంతకంటే ఎక్కువ నెలలు వాయిదా సకాలంలో ఎవ్వరైనా చెల్లించకపోతే వారు తర్వాత వడ్డీతో కలిపి కట్టేసేవారు. ఈ పద్ధతి వల్ల రుణం భారం, వాయిదాలు కేవలం అప్పు తీసుకున్న సభ్యులపై మాత్రమే ఉండేది. అప్పు తీసుకోని సభ్యులు నిశ్చింతగా ఉండేవారు. అలాగే వాయిదాలు చెల్లించని వారిని గుర్తించి వారిపై ఒత్తిడి తీసుకు వచ్చి వాయిదాలను క్రమంగా కట్టే విధంగా ఆ గ్రామం సీఏఫ్ లేదా సీసీ చర్యలు తీసుకునేవారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 3684 మంది సంఘ సభ్యులకు రూ.28 కోట్లు రుణాలు అందజేశారు.

ఆటో డెబిట్ ఇలా..

ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఆటో డెబిట్ విధానం ద్వారా అప్పు వాయిదాలు పొదుపు ఖాతా నుంచి చెల్లించాల్సి ఉంటుంది. సంఘంలో రుణం తీసుకున్న సభ్యులు సకాలంలో వాయిదాలు చెల్లించకపోయినా పొదుపు డబ్బుల నుంచి నిర్ణయించిన తేదీకి చెల్లింపులు ఆటోమేటిక్‌గా జరిగిపోతాయి. దీని వల్ల రుణం తీసుకున్న వారితో పాటు తీసుకోని వారి పొదుపు డబ్బు కూడా పోతుంది. దీంతో మొత్తం సంఘంపై భారం పడుతుంది. అలాగే కొన్నేళ్లుగా దాచుకున్న పొదుపు నగదు స్త్రీనిధికి చెల్లింపు జరిగిపోయి, రుణం వాడని సభ్యులు కూడా నష్టపోయే పరిస్థితి వస్తుంది. అందరూ రుణం తీసుకుని ఉంటే ఈ సమస్య ఉండదు. కొంతమంది మాత్రమే అప్పును తీసుకొంటే మాత్రం సమస్య తప్పదు. ఆటో డెబిట్‌తో సంఘాలు నష్టపోయే పరిస్థితి దాపురిస్తుంది.

వివాదాలకు ఆస్కారం..

ఆటో డెబిట్ విధానం వల్ల సంఘాల సభ్యుల్లో వివాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయి. రుణం తీసుకున్న వారు సకాలంలో, వాయిదాల పద్ధతిలో చెల్లింపులు చేయకపోతే అందరి పొదుపు డబ్బును బకాయి కింద డెబిట్ చేస్తారు. అందుకే రుణం తీసుకోని సభ్యులు ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ లక్ష్యాలు చేరాలని డీఆర్‌డీఏ, స్త్రీనిధి అధికారులు గ్రామ స్థాయిలో ఉన్న సిబ్బందిపై ఒత్తిడి తీసుకువస్తున్నారు.

> **అందరికీ బాధ్యత కల్పించాలి**
>
> ఆటో డెబిట్ విధానం వల్ల సంఘ సభ్యులు తీసుకున్న అప్పుపై సంఘంలో అందరికీ బాధ్యత వస్తుంది. రుణాల చెల్లింపులు సకాలంలో జరుగుతాయి. అధిక వడ్డీ భారం ఉండదు. వెంటనే రుణాలు పొందే అవకాశం ఉంటుంది.
>
> – సత్యనారాయణ, స్త్రీ నిధి ఏజీఎం, శ్రీకాకుళం

టీడీపీ దాడుల్లో గాయపడిన ఎంపీటీసీకి ఆర్థిక సాయం



రూ.50 వేల చెక్‌ను మోహనరావుకు అందిస్తున్న డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస మండలం లక్ష్మీపురం ఎంపీటీసీ గండు మోహనరావు టీడీపీ నేతల దాడిలో గాయపడిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంపీటీసీకి రూ.50 వేల ఆర్థిక సాయం పంపించారు. పలాసలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చేతులమీదుగా చెక్‌ను అందించారు.

కొత్త ఎస్పీగా కేవీ మహేశ్వరరెడ్డి

- రెండేళ్లకు పైగా ఎస్పీగా విధులు నిర్వర్తించిన జీఆర్ రాధికకు బదిలీ
- ప్రస్తుతానికి పోస్టింగ్ ఇవ్వకుండా డీజీపీకి రిపోర్టు చేయాలని ఉత్తర్వులు
- రంపచోడవరం ఓఎస్డీగా పనిచేస్తూ బదిలీపై వస్తున్న మహేశ్వరరెడ్డి
- 2018 సివిల్స్ సర్వీసు ఎగ్జామినేషన్‌లో 126వ ర్యాంకు సాధించిన ఘనత



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : జిల్లా నూతన ఎస్పీగా కేవీ మహేశ్వరరెడ్డి నియమితులయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఓఎస్డీగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వస్తున్నారు. ఇక్కడ నుంచి బదిలీ అయిన జీఆర్ రాధికకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. డీజీపీకి రిపోర్టు చేయాలని శనివారం సాయంత్రం జారీ చేసిన బదిలీ ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్ర వ్యాప్తంగా చేసిన బదిలీల్లో మన జిల్లా ఎస్పీ మార్పు కూడా జరిగింది.

జిల్లాకు బదిలీపై వస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి స్వస్థలం అన్నమయ్య జిల్లా(అప్పటి కడప జిల్లా) లక్కిరెడ్డిపల్లి మండలం పందిళ్లపల్లి గ్రామం. సామాన్య రైతు కుటుంబంలో 1991 ఏప్రిల్ 10వ తేదీన జన్మించిన మహేశ్వరరెడ్డి అంచెలంచెలుగా ఎదిగారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యాభ్యాసం ముగిశాక ఉస్మానియా యూనివర్సిటీ ఆఫ్ ఇంజినీరింగ్‌లో బీఈ(సీఎస్ఈ) చేశారు. ఆ తర్వాత ఐఐటీ ముంబైలో ఎంటెక్ సీఎస్ఈ చేశారు. దాని తర్వాత మూడున్నరేళ్లు సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీలో ఉద్యోగం చేశారు. సివిల్ సర్వీస్‌పై ఆసక్తితో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలేసి, ఆంత్రోపాలజీ సబ్జెక్ట్ ఆప్షనల్‌గా తీసుకుని సివిల్స్‌కు ప్రిపేరయ్యారు. 2018 సివిల్ సర్వీస్ ఎగ్జామినేషన్‌లో 126వ ర్యాంకు సాధించారు. 2019 ఆగస్టు 26వ తేదీన ఇండియన్ పోలీసు సర్వీసులో చేరి.. హైదరాబాద్ నేషనల్ పోలీసు అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్నారు. 72వ శిక్షణ బ్యాచ్‌లో తెలుగు రాష్ట్రాల నుంచి ఏడుగురు ఉండగా, అందులో నలుగురిని ఆంధ్రప్రదేశ్‌కు, ముగ్గురిని తెలంగాణకు కేటాయించారు. అందులో కడపకు చెందిన కేవీ మహేశ్వరరెడ్డిని సొంత రాష్ట్రానికి కేటాయించడం విశేషం.

తొలిసారి ఎస్పీగా

శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత మహేశ్వరరెడ్డి చింతూరు ఏఎస్పీగా పనిచేశారు. ఆ తర్వాత రంపచోడవరం ఓఎస్డీగా నియమితులయ్యారు. అక్కడి నుంచి తాజా బదిలీల్లో జిల్లా ఎస్పీగా వస్తున్నారు. తొలిసారి ఎస్పీ బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఇదిలా ఉండగా, 2022 ఏప్రిల్ 3వ తేదీ నుంచి జిల్లా ఎస్పీగా పనిచేసిన జీఆర్ రాధికకు బదిలీ చేసినప్పటికీ ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. డీజీపీ ఆఫీస్‌కు రిపోర్టు చేయాలని బదిలీల ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

టీడీపీ నాయకుడి ఇంటి వద్ద ఎరువుల నిల్వ



కనుగులవలసలో టీడీపీ నాయకుడి ఇంటి వద్ద లారీతో దింపుతున్న ఎరువులు బస్తాలు

ఆమదాలవలస: ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందించే ఎరువులను నిల్వ చేయడానికి గ్రామగ్రామాన ఆర్‌బీకేలు ఉన్నాయి. కానీ ఆమదాలవలస మండలం కనుగులవలస గ్రామంలో ఓ టీడీపీ నాయకుడు ఈ ఎరువులను తన ఇంటి వద్దకు తెప్పించుకుని పంపిణీ చేయడం చర్చనీయాంశమవుతోంది. ఇలా చేయడం వల్ల గ్రామంలో ఉన్న ఒకే వర్గం రైతులకు మాత్రమే ఎరువులు అందుతున్నాయని ఆ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డేపల్లి నారాయణరావు, బొడ్డేపల్లి నిరంజన్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, పంచాయతీ కార్యాలయం భవనాలు ఉన్నా అక్కడ ఎరువులు నిల్వ చేయకుండా టీడీపీ నాయకుడి ఇంటి వద్ద నిల్వ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై జేసీ, మండల వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని అంటున్నారు. అధికారులు స్పందించి ఎరువులు సక్రమంగా అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం



ఇండోర్ స్టేడియంలో ఉత్సాహంగా సాగుతున్న బ్యాడ్మింటన్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న డీఎస్ఏ ఇండోర్ స్టేడియం వేదికగా జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభమైంది. జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండురోజులపాటు స్వర్గీయ నారాయణశెట్టి వెంకట శ్రీనివాసులు (వాసు) మెమోరియల్ పేరిట పోటీలు జరుగుతున్నాయి. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. టోర్నీకి శ్రీకాకుళం, రణస్థలం, నరసన్నపేట, టెక్కలి, పలాస, కవిటి, ఆమదాలవలస, పాతపట్నం, సరుబుజ్జిలి, కొత్తూరు తదితర ప్రాంతాల నుంచి 270 మందికిపైగా బాలబాలికలు, సీనియర్ క్రీడాకారులు హాజరయ్యారు. అండర్–17, 19, సీనియర్స్ పోటీలు హోరాహోరీగా సాగాయి. తొలి రోజు రాత్రి 10 గంటల వరకు పోటీలు జరిగాయి. ఆదివారం సాయంత్రంతో పోటీలు ముగుస్తాయని అంతర్జాతీయ క్వాలిఫైడ్ రిఫరీ, టోర్నీ చీఫ్ రిఫరీ సంపతిరావు సూరిబాబు తెలిపారు.

ప్రభుత్వం దగా చేస్తోంది

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం (పీఎస్ కాలనీ): ఇంట్లో ఎంత మంది చదువుకుంటున్న పిల్లలు ఉన్నా, ప్రతి ఒక్కరికి రూ.15 వేల చొప్పున ఇస్తామని ఎన్నికల ముందు ఆర్భాటంగా, అట్టహాసంగా ప్రచారం చేసిన టీడీపీ అధికారం దక్కాక దగా చేస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తీవ్రంగా దుయ్యబట్టారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ముందు చంద్రబాబుతో పాటు కూటమిలో ఉన్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ సైతం తల్లికి వందనం పథకంపై ఆర్భాటంగా ప్రచారం చేశారని గుర్తు చేశారు. టీడీపీ గొప్పగా చెప్పుకున్న 'సూపర్ సిక్స్'లో కూడా పథకాన్ని చూపారని, కానీ ఇప్పుడు ఆ సూపర్ సిక్స్‌నే ప్రస్తావించక పోవడం బాధాకరమని పేర్కొన్నారు. మేనిఫెస్టోకు కట్టుబడి ఉండకపోవడం, ఇచ్చిన మాట తప్పడం, పథకాలు అమలు చేయకపోవడం, ప్రశ్నిస్తే దబాయించడం, ఎదురు దాడి చేయడం టీడీపీ ఆనవాయితీ అని విమర్శించారు. వైఎస్ జగన్ అధికారంలో ఉండి ఉంటే ఇప్పటికే అమ్మ ఒడి అందరికీ అంది ఉండేదని తెలిపారు. చంద్రబాబు అంటేనే పచ్చి మోసం, అబద్ధం అని మరోసారి తేటతెల్లమైందని తెలిపారు.

ప్రభుత్వానిది కప్పదాటు ధోరణి



పిరియా విజయ, జెడ్పీ చైర్‌పర్సన్

కంచిలి: తల్లికి వందనం పథకం విషయంలో ప్రభుత్వం కప్పదాటు ధోరణి అవలంబిస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ మండిపడ్డారు. ఈ మేరకు శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంత మంది పిల్లలు ఉంటే వారందరికీ తల్లికి వందనం పథకం కింద రూ.15వేలు చొప్పున ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి, ఇప్పుడు కేవలం ఒక్కరికే ఇవ్వడానికి అధికారులకు మార్గదర్శకాలు ఇవ్వడాన్ని రాష్ట్ర ప్రజలంతా గమనిస్తున్నారని అన్నారు. కేవలం ఓట్లు వేయించుకోవడం కోసమే అబద్ధపు హామీలు ఇచ్చారని, తీరా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను బుట్టదాఖలు చేసే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు నాయుడు మాటమీద నిలబడే వ్యక్తి కాదని మరోసారి ఈ పథకం అమలు ద్వారా స్పష్టమైందని పేర్కొన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకునే తత్వం కేవలం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే చెల్లిందని స్పష్టం చేశారు.

హామీలు గాలికొదిలేసి కక్ష పూరిత పాలన

- వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్



పేరాడ తిలక్

టెక్కలి: కూటమి ప్రభుత్వం హామీలు గాలికి వదిలేసి కక్ష పూరిత పాలన సాగిస్తోందని వైఎస్సార్ సీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ధ్వజమెత్తారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను ధ్వంసం చేస్తూ మరో వైపు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆస్తులు నాశనం చేయడమే కాకుండా వారిపై భౌతిక దాడులకు ప్రేరేపిస్తూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని తిలక్ దుయ్యబట్టారు. ఇప్పుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కక్ష పూరితంగా కేసులు నమోదు చేశారని మండిపడ్డారు. కేవలం నారా లోకేష్ రాజ్యాంగ విరుద్ధంగా తయారుచేసుకున్న రెడ్‌బుక్ ఆధారంగా ఇలాంటి కక్షపూరితమైన కేసులు పెడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఇదే పంథా కొనసాగిస్తే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

ప్రజల బాధలు..







పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు సూదికొండలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ఇక్కడి బావులు, బోర్లు, పవర్ బోర్లలో కూడా నీరు రావడం లేదు. దీంతో అడపాదడపా వచ్చే మున్సిపల్ ట్యాంకర్లతో ఇలా డ్రమ్ముల్లో నీరు నింపి వాడుకుంటున్నారు. ఇక్కడ దాదాపు ఐదువేల మంది జీడి కార్మికులు నివసిస్తున్నారు.

– కాశీబుగ్గ

క్లుప్తంగా

శ్రీముఖలింగేశ్వరుని సేవలో ఎన్నికల కమిషన్ సంయుక్త కార్యదర్శి



సంయుక్త కార్యదర్శిని దీవిస్తున్న అర్చకులు

జలుమూరు: శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుడిని శనివారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ సంయుక్త కార్యదర్శి జీవీ సాయి ప్రసాద్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఏకవార అభిషేకాలు, అర్చనలు చేయించి వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం ఆలయ చరిత్ర, శిల్ప సంపదను అర్చకులు వివరించి దీవించారు.

పూరీకి బయల్దేరిన ఆర్టీసీ ప్రత్యేక బస్సు



ఆర్టీసీ బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న అధికారులు, సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్: మొట్టమొదటిసారిగా శ్రీకాకుళం నుంచి పూరీ మారురథయాత్రకు ప్రత్యేక బస్సు బయల్దేరిందని శ్రీకాకుళం ఆర్టీసీ ఒకటి, రెండు డిపోల డీఎంలు పి.మల్లికార్జునరాజు, కేఎస్ఆర్ శర్మలు తెలిపారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఒకటో డిపో గ్యారేజీ ఆవరణలో శనివారం పూరి మారుయాత్రకు బయల్దేరిన బస్సును శ్రీకాకుళం-1, 2 డిపోల మేనేజర్లు పి.మల్లికార్జునరాజు, కేఎస్ఆర్ శర్మలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళం నుంచి పూరి మారు రథయాత్ర సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు వేయడం జరిగిందన్నారు. ఈ మారు రథయాత్రకు ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ శ్రీకాకుళం1వ డిపో అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్, ఆర్టీసీ అధికారులు ఎల్ఎస్ నాయుడు, రాజు, ఇజాజ్, తోటయ్య, కె.సుమన్, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

'సంస్మరణ సభను విజయవంతం చేయాలి'



రోటరీ ప్రతినిధులకు ఆహ్వాన పత్రికలు అందజేస్తున్న డాక్టర్ కృష్ణమూర్తి

సోంపేట: సోంపేటలో బీల ప్రాంత రక్షణ కోసం తమ ప్రాణాలు అర్పించిన వీరుల 14వ సంస్మరణ సభను విజయవంతం చేయాలని పర్యావరణ పరిరక్షణ సంఘ అధ్యక్షుడు డాక్టర్ యారడి కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. సంస్మరణ సభ ఆదివారం ఉదయం 10.30 గంటలకు సోంపేట కళాసీ సంఘ భవనంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు థర్మల్ స్థూపం వద్ద నివాళులర్పిస్తామన్నారు. అన్ని వర్గాల ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ సంఘ నాయకులు బార్ల సుందరరావు, నాగు, బత్తుల శంకర్, మాదిన ధనుంజయం తదితరులు ఉన్నారు.

సాహితీ సాగర మథనం

- జిల్లా కేంద్రంలో దిగ్విజయంగా సాగుతున్న ద్విశతావధానం
- సాహితీ ప్రక్రియపై ఆసక్తి చూపిస్తున్న యువత
- నేటితో ముగింపు



ద్విశతావధానంలో పాల్గొన్న సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్:

'ఇంతికీ.. బంతికీ తేడా ఏమిటి..?' ఇదీ ప్రాశ్నికుడి సవాలు.

'కొడితే.. రెండూ తిరిగి కొడతాయి..' అవధాని ఇచ్చిన జవాబు ఇది.

'సభలోకి సభ్యులకు మాత్రమే ప్రవేశమా..? అభ్యులు రావచ్చా.. తప్పు లేదా..?' అవధాన ప్రక్రియ మధ్యలో ఓ వ్యక్తికి వచ్చిన ధర్మ సందేహమిది.

'సభ్యులు, అభ్యులు రావచ్చు. కానీ అసభ్యత రాకూడదు..' మాట తడుముకోకుండా అవధాని చెప్పిన సమాధానమిది.

'మంత్రి కావాలంటే రాజకీయంలో వారికి తంత్రి కావాలా? భజంత్రీ కావాలా?' అని ఇంకొకరు కొంటెగా అడిగితే.

'విభజంత్రీ కావాలి..' అని అప్పటికప్పుడు ఓ చలోక్తిని అవధాని లాఘవంగా విసిరి నవ్వించారు.

ఇవి కొన్ని మాత్రమే. అవధాన ప్రక్రియను తిలకిస్తే ఇలాంటి పదాలన్నీ రథాలు కట్టుకుని మరీ గుండె గదుల్లోకి దూసుకెళ్తాయి. తెలుగుకు మాత్రమే సొంతమైన విశిష్ట అవధాన ప్రక్రియను ఇప్పటికీ చాలా మంది నిర్వహిస్తున్నారు. ఆశువులు, దత్తపదులు, వర్ణనలు వంటి వాటితో తేట తెనుగుకు ఇంకాస్త తీపి అద్దుతున్నారు. సుమిత్రా కళాసమితి ఆధ్వర్యంలో అరసవల్లిలో ద్విశతావధాన ప్రక్రియ దిగ్విజయంగా జరుగుతోంది. ద్విశతావధాన ప్రక్రియను వినేందుకు గాయత్రీ కళాశాలకు చెందిన కొందరు విద్యార్థులు కూడా హాజరు కావడం ముచ్చటగా కనిపించింది. అవధానంలో ప్రాశ్నికుల ప్రశ్నలకు అవధాని చలోక్తిగా, సమయస్ఫూర్తిగా, మంచి ధారణతో చెబుతున్న సమాధానాలు సభికులను ఆనంద పరుస్తున్నాయి.

యువ అవధానుల రాక

ఈ అవధానంలో పాల్గొనేందుకు దూర ప్రాంతాల నుంచి సుమారుగా 12మంది అవధానులు రాగా, అందులో సగం మంది వరకు యువకులు ఉండడం విశేషం. అవధానంపై శిక్షణ ఇచ్చేందుకు హైదరాబాద్‌లో అవధాన విద్యావికాస పరిషత్ ఏర్పాటు చేసి యువతకు శిక్షణలు ఇస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ శిక్షణ కోసం యువకులు కూడా ఆసక్తి కనబరుస్తున్నారు. అందులో శిక్షణ పొందిన అవధానులు కూడా ఇక్కడ పాల్గొన్నారు.

సుమిత్రా సాహితీ సేవ

సుమిత్రా కళాసమితి సభ్యులు ఏటా శ్రీకాకుళంలో అవధాన ప్రక్రియలు నిర్వహిస్తూ సాహితీసేవ చేస్తున్నారు. ఈ సంస్థ మొదటిగా 2015లో ప్రముఖ అవధాన పండితులు మాడుగుల నాగఫణిశర్మతో మూడురోజుల పాటు అష్టావధాన కార్యక్రమం నిర్వహించింది. అలాగే 2018లో భువన విజయం పేరుతో నాటి శ్రీకృష్ణదేవరాయల వారి ఆస్థాన భువన విజయం అష్ట దిగ్గజాలను జ్ఞప్తికి తెచ్చే విధంగా నిర్వహించారు. 2018లో అవధాని బులుసు అపర్ణతో మూడురోజులు శతావధానం, 2019 ఆగస్టు నెలలో మూడురోజుల పాటు ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకులు చాగంటి కోటేశ్వరరావుతో ప్రసంగాలు, అదే ఏడాది సెప్టెంబరు నెలలో అవధాని ఆముదాల మురళీతో మూడు రోజులు శతావధానం, 2021 ఏప్రిల్ నెలలో మూడురోజుల పాటు ప్రముఖ అవధాని మెడసాని మోహన్‌తో శతావధానం, 2022 జనవరి నెలలో మూడు రోజులు అవధాని సందీప్ శర్మతో శతావధానం, అలాగే జూలై నెలలో మూడు రోజులు అవధాని పాలడుగు శ్రీచరణ్‌తో శతావధానం, అక్టోబరు నెలలో ఒకరోజు భరత్‌శర్మతో అష్టావధానం, డిసెంబర్ నెలలో అవధాని లలితాదిత్యతో మూడురోజులు శతావధానం నిర్వహించారు. 2023 ఆగస్టునెలలో మూడురోజులు ప్రముఖ అవధాని వద్దిపర్తి పద్మాకర్‌తో శతావధానం ఏర్పాటు చేశారు. అక్టోబరులో వినూత్నంగా సప్తస్వర అవధానాన్ని వీణాపాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇప్పుడు బులుసు అపర్ణ ఆధ్వర్యంలో ద్విశతావధానం 5రోజుల పాటు నిర్వహిస్తున్నారు. ఇది ఆదివారంతో ముగియనుంది.

పిల్లలకు ఆసక్తి కలగాలి



పిల్లలకు తెలుగు పద్యాలపై ఆసక్తి కలిగించడానికి తల్లిదండ్రులు కృషి చేయాలి. తెలుగు భాష పెరిగే కొద్దీ నేటి సమాజంలో నేరప్రవృత్తి తగ్గి మంచి సమాజం ఏర్పడుతుంది. అవధాని అపర్ణక్క సమాస భాష, సరళమైన భాషలో అందరికీ చక్కనైన పూరణలు అందిస్తున్నారు.

– అవధాని రంపా సాయి కుమార్, మల్లికార్జునపురం

విద్యార్థులు తరలిరావాలి..



ద్విశతావధానం భాషను, నైతిక విలువలను పరిరక్షించే విధంగా ఉంది. ఈ ప్రక్రియలో ఎక్కువ మంది విద్యార్థులు భాగస్వామ్యమైతే మరింత ప్రయోజన కరంగా ఉంటుంది.

– ఆముదాల మురళీ, ప్రముఖ అవధాని, తిరుపతి

గీతావధానం చేస్తాను..



నాకు ముందుగా గీతావధానం చేయడానికి డాక్టర్ ఉమర్ ఆలీషా ప్రోత్సాహం ఇచ్చారు. ఇప్పటికే నేను 22 గీతావధానాలు చేశాను. అవధాన విద్యా వికాస పరిషత్‌లో శిక్షణ పొందాను. తెలుగు పద్యాలు నేర్చుకున్నాను. 7 తెలుగు అష్టావధానాలు కూడా చేశాను.

– యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు, బల్లిపాడు, అత్తిలి మండలం పశ్చిమగోదావరి

తెలుగుభాషకు సేవ చేస్తున్నాం



తెలుగు భాషకు మాకు తోచిన సేవ చేయడమే మా సంస్థ ఉద్దేశం. తెలుగు భాషకు సంబంధించి ఏ ప్రాంతానికి చెందిన వారినైనా ఇక్కడి ఆహ్వానించి వారి ప్రతిభను మన సాహితీ అభిమానులకు పరిచయం చేస్తున్నాం. మా కృషికి ఎంతోమంది దాతల సహకారం కూడా ఉంది.

– ఇప్పిలి శంకరశర్మ, 'సుమిత్ర' అధ్యక్షులు

రెండేళ్ల తర్వాత ఇంటికి వచ్చి..

- రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ఘటన స్థలంలో మృతదేహం (ఇన్‌సెట్లో) తోట నవీన్ (ఫైల్)

సోంపేట: కొర్లాం జాతీయ రహదారి వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలవలస గ్రామానికి తోట నవీన్ (23) మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన శివాజీకి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలవలస గ్రామానికి చెందిన తోట నారాయణ, సంతోషిల కుమారుడు నవీన్ కొంతకాలంగా దుబాయ్‌లో వలస కార్మికుడిగా బతుకుతున్నాడు. రెండేళ్ల తర్వాత ఈ నెల 12న ఆయన ఇంటికి వచ్చాడు. అదే గ్రామానికి చెందిన జి.శివాజీ పదిరోజుల కిందట సౌదీ నుంచి తిరిగి వచ్చాడు. వీరిద్దరూ స్నేహితులు కావడంతో శనివారం సాయంత్రం కొర్లాం వచ్చారు. కొర్లాం నుంచి బైక్‌పై పాలవలస వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. దీంతో నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. శివాజీకి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు శివాజీని సోంపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి బరంపురం తరలించారు. ఇతర దేశంలో ఉన్న కొడుకు ఇంటికి వచ్చిన ఒక్క రోజులోనే మృతి చెందడంతో నవీన్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. బారువ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి దుర్మరణం



రోడ్డుపై పడి ఉన్న కుమార్‌సాహు మృతదేహం

ఇచ్ఛాపురం: పట్టణంలోని జాతీయ రహదారి-16 పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశాకి చెందిన వ్యక్తి మృతి చెందినట్లు టౌన్ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి రూరల్ ఎస్ఐ ఎస్.లక్ష్మణ్‌రావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాలోని బరంపురం కొమ్మాపల్లి ప్రాంతానికి చెందిన కుమార్‌సాహు(57) బరంపురం నుంచి పలాసకి బైక్‌పై శనివారం సాయంత్రం బయల్దేరాడు. బెల్లుపడ సమీపంలోని గల పాత టోల్‌ప్లాజా వద్దకు వచ్చే సరికి బండి అదుపు తప్పడంతో కిందపడిపోయాడు. తలకి తీవ్ర గాయం కావడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. రూరల్ ఎస్ఐ కేసు నమోదు చేసి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రేప్ కేసులో ఆర్ఎంపీకి రిమాండ్

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు గ్రామానికి చెందిన ఓ వివాహితపై లైంగికదాడికి పాల్పడిన కేసులో శారదపురం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు దువ్వాడ ఉమామహేశ్వరరావును అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించినట్లు స్థానిక ఎస్ఐ సీహెచ్ రామారావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. బాధితురాలు ఈ నెల 9న వైద్యం కోసం ఉమామహేశ్వరరావు నడుపుతున్న ప్రైవేట్ క్లినిక్‌కి వెళ్లింది. అయితే అదే సమయంలో బాధితరాలికి మత్తు మందు ఇచ్చి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ విషయంపై బాధితురాలు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కాశీబుగ్గ రూరల్ సీఐ పి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేసినట్లు తెలిపారు.

భూమి తీసుకుంటే ఆత్మహత్య చేసుకుంటా..



తహసీల్దార్, సరస్వతమ్మ మధ్య వాగ్వాదం

కాశీబుగ్గ: పలాస మండలం రెంటికోట పంచాయతీ కంట్రగడ గ్రామంలో నిర్మిస్తున్న కల్వర్టు వివాదాస్పదంగా మారింది. కొండవైపు భూములు గల రైతులు ప్రధాన బీటీ రహదారి నుంచి రోడ్డు వేసుకోవడానికి సిద్ధమయ్యారు. దారిలో వరహాలగెడ్డ పిల్ల కాలువపై కల్వర్టు నిర్మించడానికి జేసీబీతో గోతులు తవ్వారు. ఇంతలో అదే గ్రామానికి చెందిన దళిత మహిళ చింతల సరస్వతమ్మ తన పూర్వీకుల నుంచి వస్తున్న భూమిలో తన అనుమతి లేకుండా రోడ్డు ఎలా వేస్తారని అడ్డు తగిలారు. శనివారం ఉదయం కల్వర్టు పనులు వివాదాస్పదం కావడంతో పరిశీలన కోసం పలాస మండల తహసీల్దారు ఎస్ఎస్‌వీ నాయుడు వచ్చారు. దీంతో సరస్వతమ్మ తహసీల్దార్‌తో వాగ్వాదం పెట్టుకున్నారు. తహసీల్దార్ స్పందిస్తూ 56/1/ఎ లో భూసేకరణ చేసిన స్థలం ఉందని అది ఎవరిదీ కాదని అన్నారు. అక్కడ కల్వర్టు పనులు చేసుకోవాలని ఆదేశించారు. దీంతో సరస్వతమ్మ తనకు న్యాయం జరగకపోతే తహసీల్దార్ పేరు చెప్పి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించారు. దీంతో పత్రాలు తీసుకురావాలని తహసీల్దార్ సూచించారు.

రికార్డులు పరిశీలించి పూర్తి వివరాలు వెల్లడిస్తామని అన్నారు. ఆయన వెంట రెంటికోట సచివాలయం వీఆర్‌ఓ ప్రసాదరావు, కంటగడ గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

రాజకీయ వేధింపులు ఆపాలి



ముద్దాడపేటలో ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ సభ్యులు

గార: అంగన్‌వాడీ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, లేకుంటే పోరాటం చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ అమ్మన్నాయుడు, ఉపాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి అన్నారు. శనివారం శ్రీకూర్మం పంచాయతీలోని ముద్దాడపేట గ్రామంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు ముద్దాడపేట మినీ అంగన్‌వాడీ టీచర్‌ను రాజీనామా చేయాలని బెదిరిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే అధికారులు జోక్యం చేసుకుని ఇలాంటి రాజికీయ వేధింపులు అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆఫీస్ బేరర్ జె. కాంచన, వాగ్దేవి, ఎస్.కమల, రాజు రుక్మిణీ తదితరులు పాల్గొన్నారు.

తూర్పుకాపు ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



తూర్పుకాపు ఉద్యోగులకు సన్మానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): విశ్రాంత ఉద్యోగులంతా ఆయురారోగ్యాలతో కుటుంబాలతో హాయిగా ఉండాలని తూర్పుకాపు ఉద్యోగుల సంఘం నాయకులు సురంగి మోహనరావు, రాడ కైలాశ్వరరావులు కోరారు. శ్రీకాకుళం నగరంలో ఓ ప్రైవేటు హోటల్‌లో శనివారం విశ్రాంత, పదోన్నతి పొందిన తూర్పుకాపు ఉద్యోగులు బూర్లె కాశీ, కాగితాపల్లి వెంకటనారాయణ, కాగాన వెంకటరమణలకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తూర్పుకాపులంతా ఐక్యతగా ఉండాలని అప్పుడే అనుకున్న లక్ష్యాలు సాధించుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గౌరవ అధ్యక్షులుగా అంకడాల తవిటన్న, అధ్యక్షులుగా ముచ్చెర్ల రామజోగినాయుడు, ఉపాధ్యక్షులుగా కిల్లారి నారాయణరావు, నడిమింటి అప్పలనాయుడు, ఎం.సత్యనారాయణ, కార్యదర్శిగా పడాల తమ్మినాయుడు, అదనపు కార్యదర్శిగా దన్నాన మోహన్, కరణం నర్సింగరావు, కోశాధికారిగా మక్కా శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలిగా సురవరం పార్వతి, కార్యవర్గ సభ్యులుగా కరణం చిన్నవెంకటరమణ, కాగాన వెంకటరమణ, లావేటి సుందరరావు, పతివాడ సురేష్, మజ్జి రామారావు, తులగాపు సాయిదీక్షిత్, బోర శ్రీధర్‌లను ఎన్నుకున్నారు.

బైక్ ఢీ కొని వృద్ధుడి మృతి



జలుమూరి ఆనందరావు మృతదేహం

పెదగంట్యాడ : మండలంలోని దయాల్‌నగర్, బీసీ రోడ్డులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. న్యూపోర్టు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ ఉమా మహేశ్వరరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా, కోటబొమ్మాళి మండలం, సరియాపల్లికి చెందిన జలుమూరు ఆనందరావు (65) దయాల్‌నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. అతను కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ మాదిరిగానే శుక్రవారం ఆయన కూలి పనులకు వెళ్లి తిరిగి సాయంత్రం 7 గంటల సమయంలో ఇంటి వస్తూ.. దయాల్‌నగర్ వద్ద బీసీ రోడ్డు దాటుతుండగా గాజువాక నుంచి పెదగంట్యాడ వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న కర్రి మోహన్‌రావు అనే యువకుడు ఢీకొట్టాడు. దీంతో ఆనందరావు రోడ్డుపై తుళ్లిపడ్డాడు. తలకు తీవ్రంగా గాయాలు కావడంతో వెంటనే అతడ్ని అగనంపూడి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాత్రి 9.30 గంటల సమయంలో మృతి చెందాడు. ఈ ప్రమాద సంఘటనపై సమాచారం అందుకున్న న్యూపోర్టు ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. మృతుని కుమారుడు జలుమూరి సాయికిరణ్ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ ఉమా మహేశ్వరరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తా

టెక్కలి రూరల్: స్థానిక ఇసుక ర్యాంపు వద్ద శనివారం ఒక ట్రాక్టర్ బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. గత కొద్ది రోజులుగా ఇసుక ర్యాంపు వద్దకు పదుల సంఖ్యలో ట్రాక్టర్లు వస్తున్నాయి. శనివారం ఇసుక లోడ్ తెచ్చేందుకు ఒక ట్రాక్టర్ ర్యాంపులోకి వెళ్తూ తూనిక మిషన్‌పై పెట్టే క్రమంలో బోల్తా పడింది. అక్కడున్న వారు తప్పుకోవడంతో ప్రమాదం తప్పింది. అనంతరం జేసీబీ సహాయంతో ట్రాక్టర్‌ను బయటకు తీశారు.

మారానని నమ్మించి.. నట్టేట ముంచుతున్నారు

- జీపీఎస్ విధాన గెజిట్‌ను కూటమి ప్రభుత్వం విడుదల చేయడం దుర్మార్గం
- జీఓ కాపీలను దగ్ధం చేసిన యూటీఎఫ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు



శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలో నిరసన వ్యక్తంచేస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సంపతిరావు కిశోర్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండ ఉమాశంకర్, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమేష్ పట్నాయక్ తదితరులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీపీఎస్ విధానాన్నే.. కూటమి ప్రభుత్వం గెజిట్ రూపంలో 12వ తేదీన విడుదల చేయడం దుర్మార్గమని యూటీఎఫ్ నాయకులు మండిపడ్డారు. తాను మారానని నమ్మించి చంద్రబాబు నట్టేట ముంచుతున్నారని విమర్శించారు. రాష్ట్రసంఘ పిలుపు మేరకు యూటీఎఫ్ జిల్లాశాఖ నాయకులు, రాష్ట్ర నాయకులు శ్రీకాకుళంలోని డే అండ్ నైట్ జంక్షన్ వద్ద శనివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వం విడుదల చేసిన జీఓ కాపీ ప్రతులను దగ్ధం చేశారు.

ప్రభుత్వం ఏర్పడిన నెలరోజులకే..

ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కాకముందే ఇలాంటి చర్యలకు ఉపక్రమించడం బాధాకరమని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు మేలు చేస్తామని, సీపీఎస్‌ను రద్దు చేస్తామని పాత పెన్షన్ విధానం అమలుకు తగు చర్యలు తీసుకుంటామని ఎన్నికల ముందు చెప్పి.. తీరా అధికారంలోకి వచ్చిన నెలరోజులకు పాత ప్రభుత్వం తీసుకొచ్చిన జీపీఎస్‌నే అమలు చేసేలా ఏకంగా గెజిట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. వెంటనే ప్రభుత్వం గెజిట్‌ను ఉపసంహరించుకోవాలని యూటీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. లేని పక్షంలో ఉద్యోగ, ఉపాధ్యాయులతో రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి, జిల్లా కోశాధికారి బి.రవికుమార్, జిల్లా కార్యదర్శులు పి.సూర్యప్రకాశరావు, జి.సురేష్ ఆడిట్ కమిటీ సభ్యులు బి.గౌరీశ్వరరావు, కె.సురేష్, జగదీశ్వర్, బి.పురుషోత్తం, కోదండరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శివరాంప్రసాద్

రాజపత్రం విడుదల దారుణం

సోంపేట: సీపీఎస్ ఉద్యోగులకు జీపీఎస్ అమలు చేస్తూ ప్రభుత్వం రాజపత్రం విడుదల చేయడాన్ని ఖండిస్తున్నట్లు యూటీఎఫ్ ప్రతినిధులు పేర్కొన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. దీనిపై టీడీపీ నాయకులు హామీలు ఇచ్చి ఇప్పుడు పాత తారీఖుతో రాజపత్రాన్ని విడుదల చేయటం దుర్మార్గమని అన్నారు. రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు సోంపేటలో గెజిట్ కాపీలను దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లండ బాబురావు, జిల్లా కార్యదర్శి మురళీ ప్రకాష్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కూర్మారావు, దొరబాబు తదితరులు ఉన్నారు.

'పాత పింఛన్ విధానమే అమలు చేయాలి'

ఇచ్ఛాపురం రూరల్: సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆపస్(ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం) సీపీఎస్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలో నిర్వహించిన ఆపస్ కార్యవర్గ ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం సీపీఎస్/జీపీఎస్ విధానాన్ని పునః సమీక్షించి ఆమోదయోగ్యమైన పరిష్కారానికి కృషి చేస్తామంటూ హామీ ఇచ్చిందని, కానీ ఇప్పుడు ఇందుకు భిన్నంగా పాత తేదీతో జీపీఎస్ అమలు చేస్తూ రాజపత్రాన్ని విడదల చేయడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. 2017లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ను తక్షణమే అమలు చేసి 2003 డీఎస్సీ ద్వారా నియామకమైన టీచర్లందరినీ తిరిగి పాత పెన్షన్‌లోకి పునరుద్ధరించడానికి కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి కవ్వింపు చర్యలతో ఉద్యోగులను ఆందోళనకు గురిచేయవద్దని కోరారు. ఆపస్ జిల్లా అధ్యక్షుడు దుప్పల శివరాంప్రసాద్, ప్రధాన కార్యదర్శి కీలు సోమేశ్వరరావు, ఆపస్ మండల అధ్యక్షుడు బి.శంకరం, మండల ప్రధాన కార్యదర్శి ఎం.తారకేశ్వరరావు, కె.చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి'



ఏపీ సీపీఎస్ యూఎస్ జిల్లా అధ్యక్షుడు గురుగుబెల్లి భాస్కరరావు

శ్రీకాకుళం అర్బన్: సీపీఎస్(కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం) రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షగా ఉంటే, దానికి విరుద్ధంగా ప్రభుత్వం బ్యాక్ డేట్‌తో జీపీఎస్ అమలు చేస్తూ రాజపత్రాన్ని విడుదల చేయటం దుర్మార్గమని ఏపీ సీపీఎస్ యూఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గురుగుబెల్లి భాస్కరరావు, చల్లా దుర్గాప్రసాద్ అన్నారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2023 అక్టోబర్ నుంచి సీపీఎస్ ఉద్యోగులందరినీ జీపీఎస్‌లోకి తెస్తూ రాజపత్రాన్ని ఇప్పుడు విడుదల చేయటం ఉద్యోగ ఉపాధ్యాయులను మోసానికి గురి చేయటమేనని పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వంపై ఉద్యోగులు చాలా ఆశలు పెట్టుకొని అత్యధిక మెజార్టీతో గెలిపించారని, ఉద్యోగుల ఆశలను అడియాశలు చేస్తూ ప్రభుత్వం ఈ రాజపత్రాన్ని విడుదల చేయడం శోచనీయమన్నారు. తక్షణమే విడుదల చేసిన ఈ రాజపత్రాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్‌ని పునరుద్ధరించడానికి కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.